క్లుప్తంగా

వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడిలో గురువారం సాయిబాబా, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాల వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి సమ ప్రాధాన్యమివ్వాలి



మంగళగిరి: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాల మాదిగ సమాజిక వర్గానికి న్యాయం ప్రకారం సీట్లు కేటాయించాలని పేరిపోగు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్ క్లబ్ భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ 29 అసెంబ్లీ, నాలుగు పార్లమెంట్ సీట్లలో రాజకీయ పార్టీలు మాదిగలకు సగం సీట్లు కేటాయించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో వాదనలు జరుగుతున్న నేపథ్యంలో పలు రాష్ట్రాలు వాదనలకు అడ్వకేట్ జనరల్‌లను నియమించాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 19న విజయవాడలో జరిగే సమావేశానికి మాదిగలు, ఉప కులాలు హాజరు కావాలని కోరారు. పులిపాక ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

రూ.6,54,800 జరిమానా

మంగళగిరి: పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 2,788 సర్వీసులు తనిఖీ చేసి, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న వారితో పాటు అధిక లోడు విద్యుత్ వినియోగిస్తున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసులలో 98 మందిని గుర్తించి వారి నుంచి రూ 6,54,800లు జరిమానా వసూలు చేయాలని నిర్ణయించినట్లు సీఆర్‌పీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. తనిఖీలలో విద్యుత్ శాఖ అధికారులు వీఎల్ఎన్ మూర్తి, టీవీ తులసీరామ్, అక్కల సత్యనారాయణ, కేవీ కోటేశ్వరరావు, డీఈఈలు, ఏఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విశాఖలో తుళ్లూరు యువకుడి ఆత్మహత్య

అల్లిపురం(విశాఖ దక్షిణ): లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహారాణి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మల్‌హత్ బాలాజీ నాయక్ (28) ఈ నెల 5న పందిమెట్ట దరిలోని ఒక లాడ్జిలో దిగాడు. ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చానని లాడ్జి సిబ్బందికి తెలిపాడు. గురువారం ఉదయం 10 గంటలకు హోటల్ గది చెక్ అవుట్ చేయాల్సి ఉంది. ఎంతకీ అతను గది నుంచి బయటకు రాకపోవటంతో లాడ్జి సిబ్బంది తలుపు కొట్టినా లోపల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో వారు మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మరో తాళం చెవితో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతదేహాన్ని దించి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. గదిలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలిపారు. లాడ్జి యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారా భువనేశ్వరి పరామర్శ

ఫిరంగిపురం: కండ్రిక శివారు రేగులగడ్డ గ్రామంలో గురువారం నారా భువనేశ్వరి పర్యటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో మృతి చెందిన గ్రామస్తుడు, టీడీపీ కార్యకర్త నల్లజర్ల చెన్నకేశవరావు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అనంతరం రూ.3లక్షల నగదు చెక్కును అందజేశారు. ఆమె వెంట టి.శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ అనూరాధ, డి.ప్రభాకరరావు, ఎం. నరసింహారావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: రెడ్డిపాలెం, నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం - నంబూరు రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్ఐ జి.వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

ప్రజల గుండెల్లో దేవుడిగా సీఎం జగన్

'గుడ్ మార్నింగ్ మంగళగిరి'లో సమన్వయకర్త చిరంజీవి



5వ వార్డులో మహిళలకు అభివాదం చేస్తున్న సమన్వకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: సంక్షేమ పథకాల అమలుతో పేదల గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిగా నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ సమన్వకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 5వ వార్డులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధిని చూస్తున్న ప్రజలు మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జిల్లా నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మల్లవరపు సుధారాణి, బెజ్జం రాజాజీ, తోట శ్రీనివాసరావు, గుండా మధు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే నిజమైన దేశాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: మహాత్ముని కలలు కన్న గ్రామాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని ఐటీసీ లీఫ్ డివిజన్ ఉపాధ్యక్షుడు టి. కృష్ణకుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం 'గ్రామీణ వ్యవస్థాపకత-స్వాలంబన గ్రామీణ భారత దేశ నిర్మాణం 'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ, గ్రామీణ రంగాభివృద్ధి, వాటి పునర్నిర్మాణానికి సరైన ప్రణాళిక, వ్యూహాలు అవసరమని తెలిపారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ సంస్థల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, అందులో ప్రధానమైనవి పట్టణ ప్రాంత పరిశ్రమల నుంచి పోటీని తట్టుకునే శక్తి, నిరుద్యోగిత, సరైన సాంకేతికత లేకపోవడం వంటివి ఉన్నాయని చెప్పారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.వి. సత్యగోపాల్ మాట్లాడుతూ గ్రామీణ రైతు ఎప్పుడైతే సంతోషంగా ఉంటారో అప్పుడే దేశం సంతోషంగా ఉంటుందని వివరించారు.

శ్వాస మీద ధ్యాసతోనే ఆరోగ్యం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం: శ్వాసమీద ధ్యాసతోనే ఆరోగ్యం చేకూరుతుందని పిరమిడ్ మాస్టర్ పొన్నగంటి లక్ష్మీ అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో పిరమిడ్ ధ్యానంపై విద్యార్థులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం అలవాటుచేసుకోవాలని, దీంతో ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. సాత్విక ఆహారం తీసుకోవడం ద్వారా శరీరం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి మనిషి ధ్యానం చేయడం ద్వారా నాడీ మండలం శుద్ధి అవుతుందని, రక్తప్రసరణ సాధారణ స్థాయిలో ఉంటుందని చెప్పారు. ధ్యానం ద్వారా అనారోగ్యాలు దూరం అవుతాయన్నారు. వారం రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

యూఎస్ వీసా సాధనపై అవగాహన



విద్యార్థులకు వీసాపై అవగాహన కల్పిస్తున్న యెవెట్ బన్సల్

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయాన్ని ఢిల్లీలోని యూఎస్ కాన్సులేట్‌లో మాజీ వీసా అధికారి యెవెట్ బన్సల్ గురువారం సందర్శించారు. ఎక్సెల్లా ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ అధికారి శ్యామ్‌తో కలసి వర్సిటీకి వచ్చిన ఆమెకు అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులకు యూఎస్ కాన్సులేట్‌లో వీసా ఇంటర్వ్యూలు ఎదుర్కోవడం, దరఖాస్తు చేసుకునే విషయాలపై అవగాహన కల్పించారు. విదేశాలలో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులు బహుళ ఐ-20ను స్వీకరించినప్పుడు విశ్వవిద్యాలయాల ఎంపికకు ఎలా ప్రాధాన్యం ఇవ్వాలనే విషయంపై సూచనలు చేశారు. డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అభ్యర్థులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వారి లక్ష్యాలను చేరుకోవడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, వైస్ చాన్సలర్లు ప్రొఫెసర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: పట్టణంలోని 22వ వార్డు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఇటికల క్రాంతి, దర్శనం రాజు, నాగళ్ళ శ్రీను, కట్టెపోగు బాజీ, నాగళ్ళ ప్రేమ్‌కుమార్, ఇటికల గోపి, నాగేళ్ళ మహేష్, జె.ఫిరోజ్, చిన్నా గోపి, మాచర్ల వెంకటనారాయణ, జంగా బత్తుల పుల్లయ్య తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జీజీహెచ్ అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా తెలిపారు. ఇటీవల ఆసుపత్రి రైల్వే స్టేషన్ గోడ వద్ద పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా ఆసుపత్రిని పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నెలకున్న వాతావరణాన్ని డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ ఆమెకు వివరించారు. రెండు, మూడు రోజుల్లో ఆసుపత్రి గోడకు ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఆశా తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, నర్సింగ్ సూపెరింటెండెంట్లు కె. ఆశా సజని, గంగమ్మ, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య రంగాభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన లింగేశ్వరరెడ్డిని కలిసిన హెచ్ఎంలు ఆయనతో పాటు ఇప్పటి వరకు ఆర్జేడీగా పని చేసి బదిలీ అయిన వీఎస్ సుబ్బారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్జేడీని కలిసిన వారిలో హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ. తిరుమలేష్, గౌరవాధ్యక్షుడు జె.సురేష్‌కుమార్, గుత్తా శ్రీనివాసరావు, సీజే మణికుమార్, ఎన్వీ నాగమణి, కె. వీరాస్వామి, టి. శ్రీధర్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.

304 మందికి ఆరోగ్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు శ్వేత

ఫిరంగిపురం: వేములూరిపాడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 304 మందికి డాక్టర్ శ్వేత వైద్య, రక్త పూత పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు బరువు, ఎత్తు కొలిచి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ , ఏఎన్ఎం అంతోని రాణి, హెచ్‌ఏ బాబురావు, ఆశాలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగళగిరి: యువత మత్తు పదార్థాలు వాడితే జీవితం అంధకారమవుతుందని, వాటికి దూరంగా ఉండాలని జేహెచ్ పట్టణ కార్యదర్శి ఎండీ యూసఫ్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలను నిర్మూలించి, ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దేందుకు జమాతె ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. గురువారం కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండీ అజీమ్, కరిముల్లా, సభాన్, దౌలా, జాకిర్, అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... పట్టాభిపురంలో నివాసం ఉండే ఓ మహిళ ఫొటోల్ని వ్యక్తి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నాడు. గుర్తించిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

వృద్ధుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన వెంకటరమణారెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ...

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌కు చెందిన మల్లెల అలేఖ్య (30) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



వాల్ పోస్టర్లు ఆవిష్కరించిన కమిషనర్ వి.నిర్మల్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ విమాదేవి

మంగళగిరి: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం విజయవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అన్నారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అల్బెండజోల్ మాత్రలు పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. 1 నుంచి 19ఏళ్ల వయస్సు కల ప్రతి ఒక్కరికి మాత్రలు పంపిణీ చేయాలని, 2, 3 సంవత్సరాల పిల్లలకు మాత్రలు పొడి చేసి మింగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్ర నాథ్, ఎంఈఓ ఎస్.బాబు, మెడికల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

తాడేపల్లిరూరల్: ప్రకాశ్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు డాక్టర్ మానస, తాడేపల్లి ఎంఈఓ డి.నాగేశ్వరరావు పాఠశాలల్లో గురువారం పర్యటించారు. నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు వల్ల చిన్నారులకు కడుపు నొప్పి, ఒంటిపై దద్దుర్లు, దురదలు, ఆకలి మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. వీటి నివారణకు శుక్రవారం అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రతి పాఠశాలలకు నివారణ మాత్రలు అందజేస్తున్నామని తెలిపారు.

భోజనం చేసిన తర్వాత...

ఫిరంగిపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు భోజనం అనంతరం అల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీడీఓ విమాదేవి వారికి సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీల వైద్యులు ఫరీనా బేగం, యానీ గ్రేస్, ఎస్తేరు రాణి, శ్వేత, ఎంఈఓలు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీల్లో వ్యర్థాలతో అనారోగ్యం

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్



డిప్యూటీ కమిషనర్ శివారెడ్డికి సూచనలిస్తున్న కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లిరూరల్ : రోడ్లపై, డ్రెయినేజీల్లో చెత్తా చెదారాన్ని పడేయడంతో.. ఆరోగ్యం దెబ్బతింటుందని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్డు, క్రిస్టియన్ పేట, వైఎస్సార్ సెంటర్‌లో డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఆర్వో మురళి, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. పలు ప్రాంతాల్లోని డ్రెయినేజీల్లో ఆహార, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేసి ఉండటాన్ని గమనించారు. దీనిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. చెత్తా చెదారం రోడ్లపై, డ్రెయినేజీల్లో వేయడం వల్ల దోమలు వృద్ధి చెంది, అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రజలకు వివరించారు. ఇక నుంచి సచివాలయ పరిధిలో ఇంటింటికి చెత్త సేకరణ జరగక పోతే.. తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారాలను దగ్గరుండి శుభ్రం చేయించారు. కొన్ని చోట్ల తాగునీటి పైపులైన్లు లీకేజీలను గుర్తించి, ఇంజినీరింగ్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. హోటల్ యజమానులు వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని, కార్పొరేషన్ సిబ్బందికి అందజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

రక్తదానం.. ప్రాణదానం



పండ్ల రసం అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న క్షతగాత్రులకు ప్రాణదానం చేసిన వారవుతారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గుంటూరు రెయిన్‌బో రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ శిబిరంలో మొత్తం 150 మందికి పైగా విద్యార్థుల రక్తదానం చేశారు. దాతలను ప్రిన్సిపల్‌తో పాటు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.శంకరరావు పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తులపై అప్రమత్తత అవసరం



బీఎల్ఓలతో సమావేశమైన అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ రోల్) అనంతరం అందిన దరఖాస్తుల్ని బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ) అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తూర్పు నియోజకవర్గ బీఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం తుది జాబితా అనంతరం కూడా అనేక రకాల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అనంతరం సూపర్వైజరీ అధికారులు సంతకం చేసి తదుపరి అనుమతుల కోసం ఏఈఆర్వోకి పంపాలని స్పష్టం చేశారు. ప్రధానంగా నూతన ఓట్ల చేర్పులు, తొలగింపు దరఖాస్తులు సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్వోలు నేరుగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల్ని పరిశీలించి, అవసరమైన వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని బీఎల్ఓలకు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై బాధ్యత తీసుకోవాలని సూపర్వైజరీ అధికారులకు ఆమె సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు డి.వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK MABU SUBHANI (Old Name), S/o. (Late) SHAIK NAMAJA VALI, R/o. Door No. 5-143, Tadikonda Village and Mandal, Guntur District - 522036, Andhra Pradesh, have changed my name to SHAIK MAHABUSUBHANI. Hereafter my name is known as SHAIK MAHABUSUBHANI.

ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా,మంగళగిరి మండలము,కాజా గ్రామము కాపురస్తులు సంపత్తి సూర్యారెడ్డి గారి కుమారుడు వీరారెడ్డి గారి సంతానముకు పొందిన సూచన్ననుదికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింటు గుంటూరు జిల్లా కాజా గ్రామానికి చెందిన డి.నెం.343/3 రు దాఖలా వ.గ.128 ల ఖాళీ నివేశన స్థలమును ఈమని సుబ్బారెడ్డి గారి కుమారుడు ఈమని ప్రతాపరెడ్డి గారి నుండి ది.03-10-2009 వ తేదీన కాల్యము చేసి వారి నుండి విక్రయ దస్తావేజు నెం.2567/2009 రుగా ఐదకాని సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్ చేయించుకొని తదాది నుండి నిరాటంకముగా అనుభవించుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు ఈమని బ్రహ్మయ్య రామిరెడ్డి గారి కుమారుడు పుల్లారెడ్డి గారి పేరు మీద వున్న ఒరిజినల్ విక్రయ దస్తావేజు నం.1204/1992 రు గతకులోనే నా క్లయింటు యొక్క విక్రయదారులు వద్ద [illegible] నా క్లయింటుకు [illegible], కావున సదరు దస్తావేజుకు [illegible] నా క్లయింటు మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నుండి పొంది వున్నారని తెలియచేయుచున్నారు. కావున పై చెప్పబడిన ఆస్తిని నా క్లయింటు ఏదైనా బ్యాంకువారికి [illegible] ఈ ప్రకటన వెలువడిన ఏడు దినములలోగా [illegible] నా క్లయింటుకు క్రింద చేయగలరు.

P.N.V.Ravi Teja, B.Sc.B.L.,
D.S.V.Prasada Rao, B.A.B.L
Advocates,
D.No.30-13-17/1, 2ndFloor, Eluru Road,
Durga Agraharam, Vijayawada-2,
Cell: 8142141384, 9032226262

విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యే సమాజాభివృద్ధికి బీజం వేస్తుందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో గురువారం 49వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ విద్యావంతులతోనే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. విద్యార్థి మనోవికాసానికి దోహదం చేసేలా విద్య ఉండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో బాలకుటీర్ ఇదే విధంగా నాణ్యమైన విద్యా విధానంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఆకాశవాణి డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే మానసిక వికాసం సాధ్యమని తెలిపారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతోనే పిల్లల సంపూర్ణ వికాసం సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలకుటీర్ ఉపాధ్యక్షుడు రావెల సాంబశివరావు, డీఈవో పి. శైలజ, పాఠశాల సహ కార్యదర్శి జయశ్రీ , సీఏవో దుర్గా రఘురామ్, ప్రిన్సిపాల్ సుధా మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.